అన్నాను; చీకట్లో బాణం విడుస్తూ.

"మొత్తానికి అసాధ్యుడివోయి గోపాలం!" అంటూ సోమయాజులుగారు సంతకం పెట్టేశారు.

కథ అయిపోయింది.

చిదంబరం దోసె కూడా అయిపోయింది. ★

## 43. ఎపిసోడ్ నెంబరు 14

జగన్నాథానికి వీడ్కోలు చెబుదామని రైలు స్టేషను కెళ్తుంటే చెయ్యి అడ్డంపెట్టి నా స్కూటర్ ఆపేడు ఖుస్రో. "నేనూ అందుకే" అన్నాడు. ఎక్కించుకోక తప్పలేదు. ఖుస్రో మంచి మిత్రుడే; కాని, కొంచెం ఎక్కువ మాట్లాడతాడు. పైగా మధ్యలో ఎన్ని అ"వాంతి"రాలు వచ్చినా తను చెప్పదలుచుకున్నదేదో చెప్పిగానీ నాయకుడు వేదిక దిగనట్టు ఇతను మన వీపు దిగడు. అయినా అతన్ని భరించక తప్పదు. ఎందుకంటే, ఖుస్రో నాకూ జగన్నాథానికీ కామన్ ఫ్రెండు. ఇవాళ రైలు దగ్గిర వీడ్కోలివ్వడానికి అతనికి నేను లిఫ్ట్ ఇవ్వని కారణంగా అతను జగన్నాథాన్ని మిస్ అయ్యేడంటే రేపెప్పుడైనా అతను కనబడ్డప్పుడు "చూసేవా గురూ" అంటూ అంతా చెప్పేగల్డు.

స్టేషన్ చేరే వరకూ అతనే ఏదో మాట్లాడేడు. కాని స్టేషన్ చేరగానే పార్కింగు స్పేస్ దగ్గిర రద్దీ చూసి "అయ్యబాబోయి; ఇన్ని స్కూటర్లున్నాయేంటి, ఇక్కడ!" అన్నాను నేను.

"మరేంటనుకున్నావు! రైలు కెళ్లేవాళ్లు వంద మందయితే సాగనంపే వాళ్లు ఐదువందల మందుంటారు!"

"చినుకులొచ్చేటట్టున్నాయి. బండి తడిసి పోతుందేమో. పార్కింగు చేసుకోడానికిక్కడ షెడ్డు కాదుగదా, చెట్టు నీడయినా లేదు. మళ్ళీ ఈ పది నిమిషాల భాగోతానికీ అర్ధ రూపాయి ఛార్జి చేస్తారు. ఇలా రైలు రైలుకీ రెండు మూడు వందల చొప్పున పోగు చేసే కంట్రాక్టరు ఒక షెడ్డు కట్టించినా బాగుండిపోను."

"రైల్వే జాగాలో షెడ్లు కట్టి ఏం సుఖం? ఏ బీచిరోడ్డు మీదనో, ఎపార్టుమెంట్లు కట్టుకుంటున్నాడేమో, పాపం".

అలా మాట్లాడుకుంటూ ఒక చోట నా స్కూటర్ని ఇరికించాను. ఖుస్రోని దిగమని నేనూ దిగేను. ఇంతలోకే ఆ పద్మవ్యూహాన్ని అవలీలగా చీల్చుకుంటూ ఒక కుర్రాడొచ్చి అత్యంత మిక్కిలి పల్చటి కాగితం (చిన్న) ముక్క నా చేతిలో పెట్టి యాభై పైసలు పట్టుకుపోయాడు. ఆ చిన్ని కాగితం ముక్కని పది నిమిషాలపాటు పారేసుకోకుండా కాపాడుకున్నందుకు ఓ రూపాయి "ఇనాం" ఇవ్వచ్చున్నాడు ఖుస్రో.

"యాభై పైసలకే నువ్వింత ఇదై పోతున్నావు! మొన్న హైద్రాబాదులో వెయ్యేసి రూపాయలు కట్టి కూడా పార్కింగుకీ స్టాండింగుకీ సరైన ఏర్పాటు లేక వానలో తడుస్తూ నిలబడ్డాను తెలుసా?' అన్నాడు, రెండడుగులు నడిచి.

"ఏమిటీ? వెయ్యి రూపాయలు కట్టి ముష్టివెధవలాగ పార్కింగు లేక వానలో నిలబడ్డావా?'

"అక్షరాలా అంతే. వెయ్యి రూపాయలు పార్కింగ్ ఫీజు కాదనుకో. కాని దాంట్లో ఎంతో కొంత పార్కింగ్‌కి ఉండి వుండాలి".

"ఇంతకీ ఎందుకట; ఆ డబ్బు కట్టుట, వానలో తడియుట;"

"అదేనోయి; 13 ఎపిసోడ్లతో ఒక టీవీ సీరియల్ ప్రపోజలు ఇచ్చానుగా".

"ప్రపోజలు ఇవ్వడానికి వానలో నిలబడ్డం ఎందుకు? ఆఫీసులో సంబంధించిన సెక్షన్ కెళ్ళి ఇచ్చీవలిసింది!"

"అలా కుదర్లేదు. ప్రపోజల్సు అందుకునే "సెల్" ఆఫీసులో ఒక గదిలో పెట్టకుండా ఆఫీసు బైట కట్టిన క్వార్టర్స్ ఒక దాంట్లో పెట్టారు. ఆ రోజు ప్రపోజల్సు అందుకోడానికి ఆఖరి రోజు. సుమారు 1500 మంది ఒచ్చారు, ప్రపోజల్సు డెలివర్ చెయ్యడానికి. అందులో కొందరు ట్విన్సు, ట్రిప్లెట్సు, క్వాడ్రుప్లెట్స్ కూడా డెలివర్ చేసే భారాలతో వచ్చేరు!"

"నువ్వు కూడా ఒక సీరియల్ ఇచ్చేవా?"

"ఆ" "ఎన్ని ఎపిసోడ్లు?"

"పదమూడే"

"రామాయణం భారతం లాగ ఏ తొంభయ్యో ఇచ్చీవలిసింది!"

"90 ఏం ఖర్మ. మన ప్రాంతం అంతా మంచి కథానికా రచయితలతో సంపన్నంగా వుంది. 13 కాదు 113 కూడా సునాయాసంగా ఇవ్వచ్చు. కానీ, "సర్వసాధారణంగా ఏ ప్రపోజలూ 13 ఎపిసోడ్లకు మించి ఆమోదించబడదు" అని వాళ్లిచ్చిన "రూల్సు కాయితం" లో ఉంది. అంచేత ఎక్కువ ఎపిసోడ్లంటే ఎక్కువ శ్రమా ఖర్చులే కదా".

"శ్రమా ఖర్చులు - సమాసం బావుంది."

"థాంక్యూ. ఎన్ని ఎపిసోడ్లుంటే అన్ని స్క్రీన్ ప్లేలు రాయాలేమో అనికూడా ఒక అనుమానం వొచ్చింది."

"రూల్సు కాయితంలో స్పష్టంగా లేదా?"

"వెనకటికి ఓ లెక్కల మాస్టారు 40 మంది వున్న క్లాసులో ఒక లెక్క ఇస్తేనూ, 40 మంది 40 ఆన్సర్లు తెచ్చేరుట. అలాగ్గానే; ఆ రూల్సు కాగితం ఎందరు చదివితే అన్ని అర్థాలు చెప్పడానికి వీలు వుంది, అందులో భాష, దాంట్లో స్పెల్లింగు తప్పులూ, గ్రామరు తప్పులూ అస్పష్టతలూ జాబితా వేస్తే ఇంకో అంత కాగితం అవుతుంది! మంచి జోకు చెప్తాను. ఆ కాగితంలో ఉన్న మాటలన్నీ ఇంగ్లీషు మాటలే; కాని భాష మాత్రం ఇంగ్లీషు కాదు."

"ఇది నీ జోక్ కాదు. కీర్తిశేషులు రోణంకి అప్పలస్వామి గారిది".

"అయితే అయిందిలే, పైగా, ఆ కాగితంలో; ప్రపోజలు ఎలా ఇస్తే స్వీకరిస్తారన్న డైరెక్షన్ కంటే వివరంగా, ఎలా ఇస్తే తిరస్కరిస్తారన్నది అచ్చేసుంది". అని కథలోకి లోతుగా దిగాడు ఖుస్రో. "అదంతా అలా వుంచు. ఆఖరి రోజున కూడా ఉదయం 11 నుంచీ మధ్యాహ్నం 3 దాకా తీసుకుంటారని వుంది. సరే, గొంతులోకి ఎసరొచ్చేదాకా కదలకపోడం మన జాతీయ

స్వభావం కనక; ఆఖరి రోజునే ఇంచుమించు అందరూ వచ్చేరు. తెల్లారగట్ట లేచి వెళ్లి లైను కట్టిన వాళ్లు కొందరైతే 11 గంటలకి ఆరంభం అని ఆవేళకి చేరి లైన్లో జాయినైన వాళ్లు కొందరు. 2 గంటల వరకు తీసుకుంటారు కదాని రెండున్నర దాటేక చేరిన వాళ్లు మరికొందరు. వెరసి మొత్తం 11 గంటలప్పుడు 950 మందైతే 3 గంటలప్పుడు 1650 అయ్యారు.

"రామ రామ! అక్కడంతా ఆరు బయలు. ఎండకీ వానకీ ఓపెన్. అంచేత "ఎండ" గారు కొంతసేపు మమ్మల్ని ఏడిపిద్దామని చూసి వోడిపోతే అప్పుడు "వాన" గారు దిగబడ్డారు.

"వర్షం అయితే మటుకు? క్యూలోంచి కదిల్తే మోక్షం వుండదు అని ఒకడంటే, - తెచ్చినవే కాగితాలు కదా! తడిసిపోతే ఎలా సమర్పిస్తాం - అని మరొకడు! పోతే పోనీ, ఆరోగ్యం కాపాడుకోవాలి అని ఒకడంటే ఇలాంటి అవకాశం మళ్లీ ఎన్నేళ్లకో; అంచేత పట్టు విడువరాదు - అని వేరొకరు. అలాగ, క్యూలో కొందరు ప్రాణ భయంతో చెల్లాచెదురైనా; క్యూ ప్రాణం మాత్రం నిలబడింది.

"ఇరవై నిమిషాలు కురిసి వర్షమే ఓడిపోయాక అధికార్లు కళ్లు తెరిచారు. నెంబర్లేసి సంతకాలు చేసిన స్లిప్పులు (టోకెన్లు) పంచిపెడుతున్నాం; ఎక్కడి దొంగలు అక్కడనే గప్ చిప్ అని ప్రకటించేరు".

"ఐతే నువ్వు నీ ప్రపోజల్ 3 గంటల్లోగా ఇచ్చేవా?"

"సాయంకాలం 6 వరకు తీసుకున్నారు. అంచేత ఇచ్చేసినట్టే."

"ప్రపోజలు ఎన్ని సెట్లు ఇచ్చావు?"

" ఆ రూల్సు కాగితంలో ఒరిజినల్‌తో పాటు ఏడు కాపీలు అని వుంది. ఒరిజినల్ అనేది కాపీలలో చేరదు కదా అని 8 సెట్లు పట్టుకెళ్లాను. కాని, వాళ్లు "ఏడిస్తే" చాలన్నారు. రసీదులు 3 కాపీలు తయారు చెయ్యమని రూల్సు కాయితంలో వుంది. కాని ఒకటే చాలు అన్నారు. ఏదో చిన్న సాకు పెట్టి ఎంత ప్రతిభనైనా తొలగగొట్టడం అనే మన సంప్రదాయం చాలా తెలివిగా పరిరక్షించబడింది; అక్కడ కూడా."

"అయితే ఇది ఎపిసోడ్ నెంబరు పద్నాలుగన్న మాట" అని హాస్యం చేస్తే తప్పా ఖుస్రో మామూలు ధోరణికి రాలేదు. ★

## 44. మాటలు జాగర్తగా రానీ!

**నే**ను ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు మా ఫ్రెండు అచ్చుతరామయ్యా, నేనూ ఒక పౌరాణిక నాటకానికి వెళ్లేం.

అసలు ఆ నాటకానికి మేం వెళ్లగలిగి ఉండేవాళ్లం కాదు. దానికి టిక్కెట్లయినా ఉండాలి. లేదా కాంప్లిమెంటరీ పాస్ అయినా ఉండాలి. అయితే, అచ్చుతరామయ్య తండ్రి గారయిన వరహాలు గారు విజయనగరం మహారాజా వారి కోటలో రాణీసాహెబా వారి సిబ్బందిలో ఆదాయ వ్యయాధికారిగా పనిచేస్తూ ఉండేవారు గనక ఆయన పేరిట ఒక 'పాస్' వచ్చింది. సరిగ్గా నాటకం నాడు సాయంకాలం అచ్చుతరామయ్య చిన్నాన్నగారు కలకత్తానించి రావడంతో